ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు (ఫైల్)



స్వర్ణముఖినది సమీపంలో యంత్రాలతో మట్టి తవ్వకాలు(ఫైల్)



అక్రమ రవాణాకు రైట్.. రైట్

అధికారం అండతో కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. మమ్మల్ని ఆపేదెవరంటూ అక్రమ దందాకు తెరలేపారు. స్వర్ణముఖినది నుంచి ఇసుక, చెరువులు, అటవీ, అసైన్‌మెంట్ భూముల్లో గ్రావెల్, మట్టిని తవ్వి ట్రాక్టర్లు, లారీలతో రాత్రీ పగలు తేడా లేకుండా తరలిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారు. ఈ విషయం తెలిసినా రెవెన్యూ, మైనింగ్ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- పట్టపగలే ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ రవాణా
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు
- పేట్రేగుతున్న మాఫియా



రాజుపాలెం సమీపంలోని చెరువులో గ్రావెల్ తవ్వకాలు(ఫైల్)

పెళ్లకూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో స్వర్ణముఖినది ప్రవహిస్తోంది. ఇందులో నాణ్యమైన ఇసుక ఉంది. ఒక ట్రాక్టర్ ఇసుక ధర రూ.4500 నుంచి రూ.5 వేలు వరకు పలుకుతోంది. దీనిపై కన్నేసిన టీడీపీ కూటమి నాయకులు జేసీబీలతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా వెంకటగిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట పట్టణాలతో పాటు పలు గ్రామాలకు పట్టపగలే యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రతి రోజూ 60 నుంచి 70 ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు రోజుకు ఒకటి, రెండు ట్రాక్టర్లను పట్టుకుని రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు జరిమానా విధించి వాహనాలను వదిలేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. స్వర్ణముఖి నది ద్వారా పదివేల ఎకరాలకు పైగా భూములకు సాగునీరు, 20 గ్రామాలకు మంచినీరు అందుతోందని, ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు ఇంకిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

లేఅవుట్లకు గ్రావెల్ తరలింపు

నాయుడుపేట సమీపంలోని మేనకూరు సెజ్‌లో పరిశ్రమలు పెద్ద సంఖ్యలో ఏర్పాటవుతున్నాయి. దీంతో నాయుడుపేట చుట్టుపక్కల లేఅవుట్లు వేస్తున్నారు. వాటికి శిరసనంబేడు, రాజుపాళెం, రోసనూరు, పునబాక, చెంబేడు గ్రామాల్లోని చెరువులు, ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ అక్రమంగా తవ్వకాలు చేపట్టి గ్రావెల్‌ను లారీలతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువుల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టరాదని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కూటమి నేతలు గ్రావెల్ మాఫియాగా మారి చెరువులను గుల్ల చేస్తున్నారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అదేవిధంగా మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న అసైన్‌మెంట్ భూముల్లో యంత్రాలతో మట్టి తవ్వకాలు చేపట్టి ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. ఇక్కడ నాణ్యమైన మట్టి ఉంది. ప్రస్తుతం యూనిట్ మట్టి ధర సుమారు రూ.1000 వరకు ఉండడంతో కూటమి నేతలు దందాను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటాం

స్వర్ణముఖి నది నుంచి ఇసుక, చెరువులు, ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తవ్వి అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వారిపై కేసులు నమోదు చేసేలా ఆదేశాలు ఇస్తాం. అక్రమ రవాణా అరికట్టేందుకు క్షేత్ర స్థాయిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాము.

- కిరణ్మయి, సూళ్లూరుపేట ఆర్డీవో

క్లుప్తంగా

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



ట్రై సైకిల్ అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

చిల్లకూరు : మండలంలోని చేడిమాలలోని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత శ్రీనివాసులు పుట్టిన రోజు సందర్భంగా సోమవారం దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి ట్రీ గార్డులు ఏర్పాటు చేశారు. ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు రామానాయుడు, శిరీష,బాబు పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో ఎఫ్‌బీవోకు సన్మానం



తిరుపతయ్య దంపతులకు సన్మానం

దొరవారిసత్రం : నేలపట్టు పక్షుల కేంద్రంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్(ఎఫ్‌బీవో)గా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన కె.తిరుపతయ్యను స్థానిక ఫారెస్ట్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రేంజర్ ఆఫీసర్ నరసింహారావు, డీఆర్‌వో హరి, సెక్షన్ ఆఫీసర్ బాలయ్య, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరులో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



కల్లూరులో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు పేర్లు నమోదు చేసుకుంటున్న గ్రామస్తులు

దొరవారిసత్రం : మండలంలోని తొగరాముడి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న కల్లూరు గ్రామంలో సోమవారం తిరుపతి స్విమ్స్, శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషులు, మహిళలల్లో నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేశారు. 40 ఏళ్లు పైబడిన మహిళలు మూడేళ్లకొకసారి తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ పద్మావతి తెలిపారు. మద్యం, గుట్కా, సిగరెట్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, సర్పంచ్ ఢిల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి మధు, నాయకులు రత్నయ్య, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన




విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దామోదర్‌రెడ్డి

వాకాడు : ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థిని పవిత్రను సోమవారం శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి అభినందించారు. వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం శ్రీ పట్టాభిరామాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో దామోదర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతమైన కోట మండలం సిద్దవరంలో వ్యవసాయ కుటుంబానికి చెందిన నాశిన కృష్ణ, రాజేశ్వరి దంపతుల కుమార్తె నాశిన పవిత్ర తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం పవిత్రను సత్కరించి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దీవి అనంతాచార్యులు, హరీష్‌రెడ్డి, శివ, కృష్ణ, శేఖర్, వంశీ, కిరణ్ పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

కోట: మండల కేంద్రమైన కోట మేజర్ పంచాయతీ పరిధిలో సోమవారం బ్లూక్రాస్ సహకారంతో వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్టు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. బ్లూక్రాస్, వెటర్నరీ సిబ్బంది వీధుల్లో కుక్కలను గుర్తించి వ్యాక్సిన్ వేసినట్టు వివరించారు. తద్వారా కుక్కల బెడదను కొంత వరకు నివారించవచ్చన్నారు. తొలిరోజు 70 కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు.

నా కుమారుడిని బతికించండి సారూ..!



కొడుకు బిలాల్‌తో తండ్రి ఖాదర్

నాయుడుపేట టౌన్: నా కుమారుడిని బతికించండి సారూ అని నాయుడుపేట పట్టణానికి చెందిన ఖాదర్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడిని వేడుకున్నారు. ఆయన మాట్లాడుతూ తన కుమారుడు పట్టణంలోని ఓ బాణసంచా దుకాణంలో పనిచేస్తూ విద్యుత్ షాక్‌కు గుర్యయ్యాడని, తన కుమారుడికి వైద్యం కోసం ఇప్పటి వరకు ఇంటిని విక్రయించడంతోపాటు అప్పులు చేసి రూ.50 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. తన కుమారుడి వైద్యం కోసం ఇంకా రూ.25 లక్షలకు అవసరమతుందన్నారు. తమకు న్యాయం చేయాల ని సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్పీకి విన్నవించారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల అమ్మకం కేంద్రం ప్రారంభం



ప్రకృతి వ్యవసాయం అమ్మకం కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల అమ్మకం కేంద్రాన్ని సోమవారం తహసీల్దార్ శైలకుమారి ప్రారంభించారు. గ్రామాల్లో రైతులు పురుగు మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలను ప్రతి సోమవారమూ అమ్మకం కేంద్రంలో విక్రయించనున్నట్టు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. తొలి రోజే పలువురు రైతులు, వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన ప్రజలు కూరగాయలు, ఆకు కూరలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురామయ్య, ఏవో సుభాషిణి, ఏపీవో పద్మావతమ్మ, మోహన్‌రావు, మెహతాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై కక్ష సాధింపు చర్యలు



ఏపీవో పూర్ణిమను ఎంపీడీవో ఎదుట నిలదీస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

కోట: ఉపాధి ఏపీవో పూర్ణిమ తమపై కక్ష సాధింపు చర్యలకు దిగుతూ మానసిక క్షోభకు గురిచేస్తోందని ఫీల్డ్ అసిసెంట్లు మండిపడ్డారు. వారు సోమవారం ఎంపీడీవో భవానీని కలిసి ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోట, కొత్తపట్నం, జరుగుమల్లి, వంజివాక, సిద్ధవరం, అల్లంపాడులో పనిచేస్తున్న ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. వారు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో వారిని అధికారులు మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. ఏపీవో పూర్ణిమ వారిని వేధింపులకు గురిచేస్తున్నారు. రెండు వారాలుగా చేసిన పనులకు సంబంధించిన మస్టర్ల నమోదును రికార్డుల నుంచి తొలగించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలల జీతాల బిల్లులు పెట్టకుండా నిరాకరించారు. తమకు న్యాయం చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది



మునికృష్ణయ్య దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెళ్లకూరు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం ద్వారా కలిగే తృప్తి వర్ణించలేదని ఎంఈవో శంకరయ్య తెలిపారు. పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నేలవల్లి మునికృష్ణయ్య సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా మునికృష్ణయ్య, యశోద దంపతులను స్థానిక చాగణం ట్రస్ట్ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ పిల్లలు పలక, బలపం పట్టి అక్షరాలు నేర్చుకునే స్థాయి నుంచి కలెక్టర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, శాస్త్రవేత్తలు వంటి అత్యుత్తమ స్థాయికి చేరుకోవడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్రన్నారు. ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించాలంటే దేవుని కృప మెండుగా ఉండాలన్నారు.

వాటర్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

బాలాయపల్లి(సైదాపురం) : మండలంలోని కడగుంటలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ సోమవారం స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గత వారంలో కడగుంట గ్రామాన్ని సందర్శించారని తెలిపారు. గ్రామస్తులు తాగునీటి సమస్యపై విన్నవించినట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.7.40 లక్షలు కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రేణుక, సాయి పాల్గొన్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

రాపూరు: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. అమ్మవారు 3న బాలా త్రిపుర సుందరిదేవిగా, 4న గాయత్రిదేవిగా, 5న సంతాన లక్ష్మీదేవిగా, 6న అన్నపూర్ణగా దర్శనమిస్తారని తెలిపారు. 7న రాజరాజేశ్వరిగా, 8న ధనలక్ష్మి దేవిగా, 9న సరస్వతిదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసుర మర్ధి నిగా, 12న విజయలక్ష్మిగా భక్తులను కటాక్షిస్తారని నిర్వాహకులు వెల్లడించారు. 13న కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

కోట : స్థానిక నార్త్ గిరిజన కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు రమేష్‌బాబు కోరారు. ఆయన సోమవారం స్థానికులతో కలిసి ఎంపీడీవో భవానీకి వినతి పత్రం అందజేశారు. నార్త్ గిరిజన కాలనీలో జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చారని తెలిపారు. వాటిలో వచ్చే నీరు తాగేందుకు పనికి రావడం లేదన్నారు. దీంతో గిరిజనులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారికి మంచినీటి సదుపాయం కల్పించాలన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

డక్కిలి: చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీవో శంషాద్ బేగం తెలిపారు. పోషణ మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవా రం డక్కిలిలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెల రోజుల పాటు పౌష్టికాహారం, ఆరోగ్యంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. రక్తహీనత గురించి అవగాహన కల్పించారు. గర్భిణులు మునగ ఎక్కువగా వాడాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. సూపర్‌వైజర్ పరిమళ పాల్గొన్నారు.

అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా



సీఐ సూర్యనారాయణ

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా డి.సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో అక్రమ మద్యం రవాణా, సారా తయారీ, మత్తు పదార్థాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కరీమా బేగం

గూడూరు రూరల్ : అక్రమంగా మద్యం వ్యాపారం చేసినా, బెల్టు షాపులు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కరీమా బేగం తెలిపారు. ఆమె సోమవారం గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమె తెనాలి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సైదాపురం తహసీల్దార్‌గా రమాదేవి



సైదాపురం: సైదాపురం తహసీల్దార్‌గా ఈ రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు. గతంలో కొడవలూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న రమాదేవి ఎన్నికల విధుల్లో భాగంగా గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. అలాగే మండల ఏపీఎంగా చంద్రశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నెల్లూరు డీఆర్‌డీఏ కార్యాలయంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఏపీఎం రాధ రాపూరుకు బదిలీ అయ్యారు.

డీటీ యువరాజ్ బాధ్యతల స్వీకరణ

పెళ్లకూరు: పెళ్లకూరు డిప్యూటీ తహసీల్దార్‌గా యువరాజ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కొంత కాలంగా డీటీ పోస్టు ఖాళీగా ఉంది. ఈ క్రమంలో వెంకటగిరిలో డీటీగా పని చేస్తున్న యువరాజ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఆయన బాధ్యతలు చేపట్టి తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో వీఆర్వోలు రవిచంద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

పెళ్లకూరు: మండలంలోని పుల్లూరు సమీపంలోని స్వర్ణముఖినది నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారంతో దాడి చేసినట్టు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. రెండు ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు.

నేటి నుంచి విధులకు గైర్హాజరు

నాయుడుపేట టౌన్ : ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు కోరారు. ప్రభుత్వం తమ గురించి పట్టించుకోవడం లేదని, ఈ క్రమంలో మంగళవారం నుంచి తాము విధులకు హాజరుకావడం లేదని పేర్కొన్నారు. వారు సోమవారం ఓజిలిలో ఉన్న లిక్కర్ డిపో సీఐ గౌస్‌బాషకు వినతి పత్రం అందజేశారు. నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు, వాకాడు సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో ఆక్రమణలపై ఫిర్యాదు

నాయుడుపేట టౌన్ : మండలంలోని తిమ్మాజికండ్రిగ సమీపంలో స్వర్ణముఖి నదిని ఆక్రమించుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం జిల్లా కన్వీనర్ తీగల భాస్కర్ కోరారు. ఆయన సోమవారం తహసీల్దార్ గీతావాణికి వినతి పత్రం అందజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న పీడీ భరత్ మహీపతి



కోట: విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చిట్టమూరు(వాకాడు): ఎస్‌జీఎఫ్ పోటీల్లో భాగంగా నెల్లూరులో జరిగిన అండర్–17 రెజ్లింగ్ పోటీల్లో చిట్టమూరు జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి తీపలపూడి అనీల్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మీనాకుమారి తెలిపా రు. విద్యార్థిని సోమవారం ప్రిన్సిపాల్, పీడీ భరత్ మహీపతి అభినందించారు. అక్టోబర్ 3న విజయవాడ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అనీల్ పాల్గొననున్నట్టు తెలిపారు.

చిట్టేడు ఎస్టీ గురుకులం విద్యార్థుల ప్రతిభ

కోట: ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో చిట్టేడు ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ శుభకర్‌రావు తెలిపారు. అండర్ 19 లాంగ్ జంప్‌లో ఇ.మహేష్ 100, 200 మీటర్లలో ద్వితీయ స్థానం సాధించాడు. సీహెచ్ దావీద్ 1500 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. అండర్ 17 విభాగంలో వై.చరణ్ 1500 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానం సాధించాడు. అండర్ 14 విభాగంలో సీహెచ్ సాయిమోహన్ ఖోఖో జిల్లా టీమ్‌కు సెలెక్ట్ అయినట్లు తెలిపారు. విద్యార్థులు, పీడీ కార్తీక్, పీఈటీ మూర్తిని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర చెస్ పోటీలకు గూడూరు విద్యార్థిని..



కె.విఘ్నేశ్రి

గూడూరు రూరల్ : స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో భాగంగా నెల్లూరులో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో గూడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కె.విఘ్నేశ్రి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్టు హెచ్‌ఎం మాధవి లక్ష్మి తెలిపారు. వచ్చే నెల బాపట్లలో జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటుందన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



వినతి పత్రాలు స్వీకరిస్తున్న గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు రూరల్ : ప్రజల సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. గొల్లపల్లి వాసులు మాట్లాడుతూ తమ గ్రామంలో పందుల బెడద ఎక్కువగా ఉందని తెలిపారు. బాలాయపల్లి మండలం కడగుంట, గూడూరు మండలం విందూరులో కొంతమంది భూములను ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయా లని కోరారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఖబరస్తాన్‌కు స్థలం చూపండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ముస్లింలు

చిల్లకూరు : మండలంలోని పారిచెర్లవారిపాళెంలోని ముస్లింలకు ఖబరస్తాన్‌కు ప్రత్యామ్నాయ స్థలం చూపాలని ముస్లిం పెద్దలు కోరారు. వారు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ముత్యాలపాడు రెవెన్యూ పరిధిలోని పారిచెర్లవారిపాళెంలో హిందూ, ముస్లింలకు చెందిన శ్మశాన భూమి సుమారు 8.5 ఎకరాల వరకు ఉందని తెలిపారు. ఇటీవల శ్మశాన భూమికి మధ్యలో సాగరమాల రోడ్డు నిర్మాణం చేపట్టారని తెలిపారు. అందులో ఎక్కువ భాగం ముస్లింలకు చెందిన ఖబరస్తాన్ స్థలం పోయిందని తెలిపారు. గ్రామంలో సుమారు 250 ముస్లిం కుటుంబాలు ఉన్నట్టు తెలిపారు. భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా ఖబరస్తాన్‌కు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, అల్లాబక్షు, ఫక్రుద్దీన్, ఇస్మాయిల్, కరీముల్లా, నూరుల్లా తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేకు అర్జీల వెల్లువ



మాట్లాడుతున్న తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు వెల్లువెత్తాయి. తహసీల్దార్ శైలకుమారి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అధికంగా రెవెన్యూ సమస్యలపై వినతులు అందినట్లు తెలిపారు. తనియాలి ఎస్సీ కాలనీలో నివేశ స్థలాలపై ఏర్పడిన సమస్యను పరిష్కరించాలని పలువురు బాధితులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురామయ్య, ఏవో సుభాషిణి, మోహన్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

భూములకు పట్టాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రమిస్తున్న గిరిజన నేతలు

డక్కిలి : గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే పెంచలయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల మల్లికార్జున్ కోరారు. వారు సోమవారం తిరుపతిలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ డక్కిలి మండలం పలుగోడులో సర్వే నంబర్ 1లో ఉన్న భూమిలో 40 మంది యానాదులు అనేక ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వాటికి రెవెన్యూ, ఆర్‌ఓ ఎఫ్‌ఆర్ పట్టాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్ విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. మహిళా అధ్యక్షులు చెంబేటి ఉష, నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లంపాటి వెంకటరమణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇండ్ల మల్లి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి : గిరిజనులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వెంకటేశ్వరపురం గిరిజన కాలనీలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల కోసం అనేక పథకాలు అమలుచేస్తోందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివకుమార్, ఎంఈవో–2 జగదీష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, ఏపీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సస్యరక్షణతో నిమ్మలో అధిక దిగుబడి

వెంకటగిరి రూరల్ : నిమ్మలో సస్య రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ తిరుపాల్ తెలిపారు. స్థానిక కేవీకేలో సోమవారం రైతులకు నిమ్మ పూత రాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జూలైలో గిబ్బరేల్లిక్ ఆమ్లం, సెప్టెంబర్‌లో సైకోసిల్ హార్మోన్ మందును, అక్టోబర్‌లో 13.0.45ను పిచికారీ చేయాలని సూచించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్తలు విజయశ్రీ మాట్లాడుతూ నిమ్మ రైతులు అధికారుల సలహాలు, సూచనలను పాటించాలని సూచించారు. అనంతరం నిమ్మ రైతులకు సైకోసెల్ హార్మోన్ మందును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.నాగార్జునరెడ్డి, వెంకటగిరి, గూడూరు, డక్కిలి, బాలాయపల్లి, ఓజిలి మండలాల నిమ్మ రైతులు తదితరులు పాల్గొన్నారు.